నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 9 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

బతుకమ్మ చీరలతో మహిళలు

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ

● 'నమస్తే' కథనానికి స్పందన

తలమడుగు, నవంబర్ 8 : నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమై 'పంపిణీకి నోచుకోని బతుకమ్మ చీరలు' అనే కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది గ్రామాలకు వెళ్లి స్వయం సహాయ సంఘాల సభ్యులు, ఆదివాసీ మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్నట్లు తలమడుగు మండల ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ తెలిపారు. అర్హులైన మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. బతుకమ్మ చీరలు పంపిణీ చేయడంతో మహిళలు నమస్తే తెలంగాణ దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామస్తులతో కలిసి అడవిలో గాలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

కుంటాల బీట్‌లో పులి సంచారం

అడవిలోకి వెళ్లవద్దని హెచ్చరించిన అధికారులు

కుంటాల శివారులో పులి పాద ముద్రలను ఆసక్తిగా గమనిస్తున్న రైతులు

కుంటాల, నవంబర్ 8: కుంటాల మండల కేంద్రంలోని దౌనెల్లి వైపు గల కాలువ దగ్గర మార్నింగ్ వాక్ చేస్తున్న పలువురికి పెద్దపులి కనిపించినట్లు చెప్పారు. వెంటనే భయంతో ఊరు వైపు పరుగెత్తారు. కొందరు రైతులు పులి పాద ముద్రలను ఫోన్‌లో బంధించారు. మొన్నటి వరకు మహారాష్ట్ర సరిహద్దు వరకు వెళ్లిన పులి వెనుతిరిగి కుంటాల బీట్ పరిధిలో సంచరిస్తున్నట్లు ఎఫ్ఆర్వో వేణుగోపాల్ తెలిపారు. అడవి పందులను తరుముకుంటూ చేలల్లోకి వచ్చినట్లు అన్నారు. మళ్లీ హనుమాన్ తండా గుండా అడవిలోకి వెళ్లి పోయినట్లు తెలిసిందన్నారు. విద్యుత్ తీగలు అమర్చవద్దని, పులికి హాని కలిగించవద్దని కోరారు. అడవి పందుల బారిన నుంచి పంటలను పులులు కాపాడుతాయని తెలిపారు. ఇక్కడ ఎఫ్ఎస్వోలు కీర్తి, పూర్ణిమ, డీఆర్వో రేష్మ, ఎఫ్బీవో హరిలత, సిబ్బంది ఉన్నారు. మండలంలోని అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్నదని పశువుల కాపరులు అడవిలోనికి వెళ్లవద్దని ఎస్ఐ భాస్కరాచారి కోరారు. రైతులు గుంపుగా లేదా తోడుతో పంట పొలాలకు వెళ్లాలని సూచించారు.

ఆపరేషన్ 'మాబ్'పై పోలీసులకు శిక్షణ

శిక్షణలో పాల్గొన్న పోలీసులు

ఎదులాపురం, నవంబర్ 8 : అల్లర్లు జరిగినప్పుడు చేపట్టాల్సిన ఆపరేషన్ 'మాబ్' పద్ధతిపై పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్ మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బందితోపాటు, మహిళా పోలీసులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి మాట్లాడుతూ అల్లరి మూకలు చేసే రాళ్లు, కర్రలతో దాడులు, ఆస్తుల విధ్వంసాన్ని ఎదుర్కొనేలా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు.ఆపరేషన్ మాబ్‌లో మొదట ప్రజలకు ఎరుపు రంగు వస్త్రాన్ని సూచిస్తూ ఇక్కడి వెళ్లిపోవాలని తెలియజేయాలని, అయినా వినకపోతే గ్యాస్ ద్వారా వారిని చెదరగొట్టాలని, లేదుంట లాఠీ చార్జ్, మరింత విధ్వంసం జరిగితే తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐలు బీ సునీల్ కుమార్, సీహెచ్ కరుణాకర్ రావ్, శ్రీనివాస్, ఎస్ఐలు, మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు మొదలైనయ్..

నాకు ఐదెకరాల పొలం ఉన్నది. 20 రోజుల కిందనే పంట చేతికి రాగా, ఇక్కడి సెంటర్‌కు వడ్లు తెచ్చిన. కొనేటోళ్లు లేరు. పగలనకా, రాత్రనకా కావలి ఉంటున్న. వేరే ఏ పని చేసుకోకుండా చాలా ఇబ్బంది అయితున్నది. నా ఒక్కడియే కాదు ఊరిలో 100 మందికి పైగా రైతుల వడ్లు ఎక్కడికక్కడ కుప్పలు పోసి ఉన్నయ్. కాంగ్రెస్ పార్టీ వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలైనయ్. కేసీఆర్ ఉన్నప్పుడు రైతులకు అన్నీ మంచిగ చేసిండు. ఈ కాంగ్రెస్ అచ్చినంక రోజుకు పది సార్లు కరెంటు అస్తున్నది, పోతున్నది. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నయ్. మోటర్లు కాలిపోతున్నయ్. ఇప్పుడే గిట్లుంటే.. అచ్చేడిది ఎండాకాలం. కరెంటు మీద భరోసా లేకుండైంది. ఇటువంటి కష్టాలు వస్తయ్.. జాగ్రత్తగా ఉండండి.. ఒకటికి పది సార్లు ఆలోచించి ఓటేయుండ్రి అని కేసీఆర్ ముందే చెప్పిండు. అయినా.. కాంగ్రెస్‌ను గెలిపించినమ్. ఇప్పుడు మా చెప్పుతో మేమే కొట్టుకున్నట్లైంది. ఇంకోసారి జీవితంల కాంగ్రెస్ పార్టీ గుర్తుకు రాకుండా అయింది. ఇప్పుడే రైతుల పరిస్థితి ఇంత ఘోరంగా ఉంటే.. ఇంకా నాలుగేళ్లదాక ఎట్లనో అని భయమైతున్నది.

- జాదవ్ కిషన్, రైతు, రాయపూర్ కాండ్లి, లోకేశ్వరం మండలం

ఎక్కడి వడ్లు అక్కడే..

మార్కెట్ యార్డుల్లో కుప్పలు తెప్పలుగా ధాన్యపురాశులు

- కేంద్రాలను తెరిచినా.. వడ్లు కొనని కాంగ్రెస్ సర్కారు..
- అమ్ముకోవడానికి యార్డుల్లోనే జాగారం చేస్తున్న రైతులు
- రూ.500 బోనస్‌పై స్పష్టత ఇవ్వని రేవంత్ ప్రభుత్వం
- అయోమయంలో అన్నదాతలు..

లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీలో గతనెల 16న వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు (ఫైల్)

సన్నరకం వివరాలు..

- దిగుబడి అంచనా 62,370 మెట్రిక్ టన్నులు
- ఏర్పాటు చేయాలనుకున్న కేంద్రాలు : 122
- ఏర్పాటు చేసినవి 89
- కొన్న ధాన్యం 00
- కారణం రూ.500 బోనస్‌పై స్పష్టత లేదు

మొత్తం కొనుగోళ్ల వివరాలు

- ప్రభుత్వం ఏర్పాటు చేసే కేంద్రాలు : 287
- ఇప్పటివరకు ఏర్పాటు చేసినవి : 233
- కొనుగోళ్లు చేపడుతున్నవి 4
- కొనుగోళ్లు చేపట్టనివి 229

ధాన్యం సేకరణ లక్ష్యం	:	1.46 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు కొన్న ధాన్యం	:	154 మెట్రిక్ టన్నులు(దొడ్డు రకం)

నిర్మల్, నవంబర్ 8(నమస్తే తెలంగాణ) : ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నారు. కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం నిల్వలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 233 కేంద్రాలను ప్రారంభించిన అధికారులు కేవలం నాలుగు సెంటర్లలోనే కొనుగోళ్లు చేపడుతున్నారు. మిగతా కేంద్రాల్లో వందలాది మంది రైతులు తమ పంటను అమ్ముకునేందుకు పడిగాపులు కాస్తున్నారు. గత పదేళ్లలో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని రైతులు చెబుతున్నారు. లోకేశ్వరం, ముథోల్, దిలావర్‌పూర్, లక్ష్మణచాంద, ఖానాపూర్ మండలాల్లో 25 రోజుల క్రితమే వానకాలం పంట చేతికొచ్చింది. దీంతో అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తేమ 17 శాతం వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబెట్టాలని రైతులను మభ్య పెట్టిన అధికారులు.. ప్రస్తుతం కొనుగోళ్లను చేపట్టడం లేదు. వానకాలానికి సంబంధించి ప్రభుత్వం 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం మొత్తం 287 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 233 కేంద్రాలు ప్రారంభించినప్పటికీ, ఎక్కడ కూడా కాంటాలను ఏర్పాటు చేయలేదు. కేవలం లక్ష్మణచాంద మండలంలోని పీచర, లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్, ఖానాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లోని బన్సపెల్లిలో కొందరు రైతుల వడ్లను కొనుగోలు చేశారు. ఈ నాలుగు సెంటర్లలో 20 రోజులుగా కేవలం18 మంది రైతులకు చెందిన 154 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సీఎంఆర్ కోసం ధాన్యాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీ కోరడం వంటి షరతులను విధించింది. దీనిపై ఇంకా చర్చలు జరుగుతుండడంతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి.

నర్సాపూర్(జీ) కేంద్రంలో కొనుగోళ్లు లేక ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

సన్నాలపై స్పష్టత కరువు

సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఈ సీజన్‌లో పెద్ద ఎత్తున సన్నరకం వడ్లను సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 62,370 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. సన్నాల కొనుగోళ్ల కోసం ప్రత్యేకంగా 122 కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో 89 కేంద్రాలను ప్రారంభించినప్పటికీ.. నేటికీ ఒక్క గింజను కొన్న దాఖలాలు లేవు. దొడ్డు రకాల కొనుగోలుకే దిక్కు లేదు.. సన్నాలను కొంటారంటే నమ్మేది ఎలా అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. రూ.500 బోనస్‌పై అధికారులకే స్పష్టత లేకపోవడం కూడా రైతుల అపనమ్మకానికి కారణంగా చెబుతున్నారు. బోనస్‌పై ఆశలు పెట్టుకోకుండా ధర కాస్త తక్కువైనా నేరుగా మిల్లులకే ధాన్యాన్ని తరలించి ప్రైవేటుగా అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

20 రోజులుగా తన ధాన్యాన్ని కొనడం లేదంటూ వడ్ల కుప్పను చూపుతున్న రైతు జాదవ్ రాజు

కేసీఆర్ ఉన్నప్పుడు బాధ లేకుండే..

మాది నర్సాపూర్. నా భర్త చనిపోయినప్పటి నుంచి నేనే కూలీలను పెట్టి ఎవుసం చేయిస్తున్న. మూడున్నర ఎకరాల్లో దొడ్డు వడ్లు ఏసిన. పంటను అమ్ముకుందామని వారం కింద ఇక్కడి సెంటర్‌కు తీసుకొచ్చిన. ఇక్కడ పందుల బాధ చాలా ఉంది. పొద్దున సంది రాత్రి 7 గంటల దాక వడ్లకాడనే నెరివడుతున్న. ఎప్పుడు కొంటరో తెల్వదంటున్నరు. ఇంకా పర్మిషన్ రాలేదట. నా లెక్కనే ఊర్ల రైతులందరూ పంట కుప్పల కాడనే కావలి ఉంటున్నరు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతులకు ఇన్ని బాధలు లేకుండే. రెండు పంటలను ఎంటనే కొంటుర్రి. ఇప్పుడు ఏదొక అంక చెబుతున్రు. బాగ ఎండబెడితేనే కొంటరట. వారం సంది అదేపని ఉన్నది. పొద్దంత నేర్సుడు, రాత్రికి కుప్పలు వోసుడు. అయినా కొంటరన్న నమ్మకం లేకుండైంది. కాంగ్రెస్ అచ్చినంక రైతుబంధు పైసలు కూడ రాలేదు. బేంకుల లక్ష రూపాల పంట లోన్ తీసుకుంటే అది కూడా మాఫీ కాలేదు. రైతులకు అన్నీ కష్టాలే ఉన్నయ్.

- అరుగుమీటి లక్ష్మి, మహిళా రైతు, నర్సాపూర్(జీ).

కృత్రిమ మేధ సదస్సులో పాల్గొన్న వీసీ, అధికారులు

'ఏఐ'పై మరింత పరిశోధన అవసరం

బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర, నవంబరు 8 : ఏఐ టెక్నాలజీపై మరింత పరిశోధన అవసరమని బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు. ఆర్జీయూకేటీలో 7 రోజులుగా నిర్వహిస్తున్న కృత్రిమ మేధస్సుపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీ మాట్లాడారు. ఆర్జీయూ కేటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ చండీగఢ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించి కృత్రిమ సదస్సు విద్యార్థుల మేధసంపత్తికి చాలా ఉపయోగపడుతుందన్నారు. ఏఐ పరిజ్ఞానం పరిష్కారాలను అమలు చేయడంలో సవాళ్లు, భవిష్యత్ పోకడలు, ఏఐ ఆధారిత డిజైన్‌టూల్స్, ఇంజినీరింగ్ పద్ధతుల్లో ఏఐపై మరింత అన్వేషణ, ఏకీకరణను ప్రోత్సహించడంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, వివిధ విభాగాల ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో బాలింత అదృశ్యం

దవాఖానలో శిశువు

బాలింత నాగమణి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 8: నిర్మల్ జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో బాలింత అదృశ్యం అయింది. నిర్మల్ జిల్లాలోని భైంసా మండలం హడ్గాంకు చెందిన నాగమణి ప్రసవం కోసం నాలుగు రోజుల క్రితం నిర్మల్ మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. వైద్యులు శస్త్ర చికిత్స చేయగా పాప జన్మించింది. శుక్రవారం సాయంత్రం పాపను వదిలేసి నడుచుకుంటూ దవాఖానలో వెనుకవైపు నుంచి వెళ్లిపోయింది. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు దవాఖాన ఆవరణలో వెతికినా కనిపించలేదు. వెంటనే వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సీసీ ఫూటేజీలను పరిశీలిస్తున్నారు. బాలింత ఆచూకీ రాత్రి వరకు తెలియలేదు. సంఘటన స్థలంలో భర్త, అత్త, బంధువులు ఉన్నారు. బాలింత ఆచూకీ కోసం వెతుకుతున్నారు. బాలింత దవాఖాన నుంచి ఎందుకు వెళ్లిపోయిందో కారణాలు తెలియాల్సి ఉంది.

రైతులకు న్యాయం చేయని సీసీఐ కేంద్రాలు ఎందుకు ?

పత్తి కొనుగోళ్ల ప్రారంభానికి వెళ్లేందుకు నిరాకరించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, నవంబర్ 8 : పత్తి రైతులకు సరైన ధర ఇచ్చి న్యాయం చేయలేని సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎందుకు ? అని, వాటిని ప్రారంభించేందుకు తాను రాలేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో సీసీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పత్తి కొనుగోళ్ల ప్రారంభోత్సవానికి రావాలని మార్కెటింగ్ శాఖాధికారులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. సీసీఐ కొనుగోళ్ల ద్వారా పత్తి రైతులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని, ఫొటోలకు పోజులు ఇచ్చే ప్రారంభోత్సవాలు ఎందుకని అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పులి దాడిలో పరిహారం అందజేత

బోథ్ మండలంలోని బాబెర గ్రామానికి చెందిన రైతుల జాదవ్ దిలీప్‌కు అటవీ శాఖ తరపున మంజూరైన నష్టపరిహారాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. గత నెల 23న పెద్దపులి దాడిలో జాదవ్ దిలీప్‌కు చందిన ఎద్దు మృతి చెందింది. నష్టపరిహారం కింద రూ.25 వేలు రాగా, సంబంధిత చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. వన్య ప్రాణులతో నష్టం జరిగితే అటవీ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం పొందాలని, వాటికి ఎలాంటి హాని కలిగించవద్దని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు ఎం.నాగోరావ్, గోవింద్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నష్టపరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ల విడుదల

నేరడిగొండ, నవంబర్ 8 : ఈ నెల 10న ఆదిలాబాద్‌లో జరగబోయే టీయూటీఎఫ్ మహాసభల పోస్టర్లను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ చేతుల మీదుగా నేరడిగొండలో ఆ సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి గడ్డం మధుసూదన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎలేటి కిరణ్‌కుమార్, చిలుకూరి జగదీశ్వర్‌రెడ్డి, జాదవ్ జగదీశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- జడ్జి సౌజన్యకు తాంసి జూనియర్ కళాశాల, జడీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థుల వినతి

జడ్జి సౌజన్యకు సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న విద్యార్థినులు

తాంసి, నవంబర్ 8 : 'బస్సు సౌకర్యం కల్పించండి..మరుగుదొడ్లు నిర్మించండి..' అంటూ పలు సమస్యలపై న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌజన్యకు తాంసి జూనియర్ కళాశాల, జడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులు విన్నవించారు. శుక్రవారం తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలతో పాటు హక్కులపై జడ్జి సౌజన్య అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేయగా తాంసి, తలమడుగు, భీంపూర్ 800 మంది విద్యార్థులు ఉన్నామని బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ వినతి పత్రం ఇచ్చారు. మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని, నిర్మించాలని కోరుతూ జడ్పీ హెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. జడ్జి సౌజన్య స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇబ్బంది దాసరి గంగారాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేశ్ డొలే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, పీపీ రమణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, కేజీబీవీ, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిషేధిత మత్తు పదార్థాలను నిర్మూలించాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబర్ 8 : నిషేధిత మత్తు పదార్థాలను సంపూర్ణంగా నిర్మూలించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి ఆమె మత్తు పదార్థాల నిర్మూలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యువత మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయిని సాగు చేసినా విక్రయించినా రవాణా చేసినా, డ్రగ్స్ వాడినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలన్నారు.పోలీసు, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు చేయాలని, అంతరాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉండాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తే జిల్లా పోలీస్ నంబర్ 1908కి సమాచారం అందించాలన్నారు. ప్రతి బుధవారం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాల్లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అనివాష్ కుమార్, ఆర్డీవో రత్న కల్యాణి, జిల్లా ఎక్సైజ్ అధికారి రజాక్, డీఎస్పీ గంగారెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్ తదితరులున్నారు.